**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**జాతీయ వార్తలు**

**తేదీ: 09.10.2024** **సమయం 19.05 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. మహారాష్ట్రలో 7 వేల 600 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు శంకుస్థాపన చేశారు.
2. రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాన్ని తగ్గించేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాకు కేంద్ర ప్రభుత్వం ఈరోజు ఆమోదం తెలిపింది.
3. ప్రధానమంత్రి నరేంద్రమోదీ రేపటి నుంచి రెండు రోజుల పాటు లావోస్ లోని వియంటియాన్‌లో పర్యటిస్తారు.
4. హర్యానాలో - భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంతో ఆ రాష్ట్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బిజెపి సమాయత్తం అవుతోంది.

**PM - MAHARASHTRA PROJECT**

మహారాష్ట్రలో 7 వేల 600 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈరోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శంకుస్థాపన చేశారు. వీటిలో నాగ్‌పూర్‌లోని డా. బాబాసాహెబ్ అంబేద్కర్ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి పనులు, షిర్డీ విమానాశ్రయంలో 645 కోట్ల రూపాయలతో నిర్మించనున్న కొత్త ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ భవన నిర్మాణం పనులు ఉన్నాయి. అందరికీ అందుబాటులో ఉండే ఆరోగ్య సంరక్షణను అందించాలనే ఉద్దేశ్యంతో - మహారాష్ట్రలోని ముంబై, నాసిక్, జల్నా, అమరావతి, గడ్చిరోలి, బుల్దానా, వాషిం, భండారా, హింగోలి, అంబర్‌నాథ్ లలో ఉన్న 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రధానమంత్రి ప్రారంభించారు. టాటా ట్రస్ట్ ల సహకారంతో అభివృద్ధి చేయనున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్

స్కిల్స్ IIS ముంబైని, మహారాష్ట్ర విద్యా సమీక్ష కేంద్రం VSK ను కూడా మోదీ ప్రారంభించారు.

## CABINET-BRIEFING (EARLY)

రక్తహీనత, సూక్ష్మ పోషకాల లోపాన్ని తగ్గించేందుకు ఫోర్టిఫైడ్ బియ్యం సరఫరాకు కేంద్ర ప్రభుత్వం ఈరోజు ఆమోదం తెలిపింది. న్యూఢిల్లీలో ఈరోజు మంత్రి వర్గ నిర్ణయాలను విలేకరులకు వివరిస్తూ సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ... పోషకాహార భద్రతకు భరోసా కల్పించే - సమ్మిళిత అభివృద్ధికి ఇది ఒక ముందడుగని అన్నారు. భారతదేశానికి ఘనమైన సముద్ర వారసత్వం ఉందని, ఈ వారసత్వాన్ని పరిరక్షించడం, అభివృద్ధి చేయడం ఎంతైనా అవసరమని అన్నారు. గుజరాత్‌లోని లోథాల్‌లో నేషనల్ మారిటైమ్ హెరిటేజ్ కాంప్లెక్స్ కు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మంత్రి చెప్పారు. సరిహద్దు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి వివరించారు. రాజస్థాన్, పంజాబ్ సరిహద్దు ప్రాంతాల్లో 2 వేల 280 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని చెప్పారు. ఈ ప్రాజెక్టులకు 4 వేల 400 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు అవుతుందన్నారు. ఇది గ్రామీణ జీవనోపాధిని మెరుగుపరుస్తుందని, రహదారులను సులభంగా అనుసంధానిస్తుందని చెప్పారు.

## DSC:

తెలంగాణలో DSC 2024 లో ఎంపికైన ఉపాధ్యాయ అభ్యర్థులకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సాయంత్రం నియామక పత్రాలను అందజేశారు. హైదరాబాద్ LB స్టేడియంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో 10 వేల మందికి పైగా అభ్యర్థులకు ఈ నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, తెలంగాణా పునర్నిర్మాణంలో ప్రభుత్వ పాఠశాలల పాత్ర అత్యంత కీలకంగా ఉందని అన్నారు. విద్యా రంగంలో దీర్ఘకాలంగా ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం పలు చర్యలు తీసుకుందనీ చెప్పారు. విద్యా రంగాన్ని పటిష్టం చేసేందుకు తీసుకోవలసిన అన్నీ చర్యలనూ తమ ప్రభుత్వం తీసుకుంటుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.

**PM - LAOS**

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రేపటి నుంచి రెండు రోజుల పాటు లావోస్ లోని వియంటియాన్‌లో పర్యటిస్తారు. ఈ పర్యటనలో మోదీ 21వ ఆసియాన్-ఇండియా సదస్సు, 19వ తూర్పు ఆసియా సదస్సులో పాల్గొంటారని విదేశాంగ మంత్రిత్వ శాఖ కార్యదర్శి జైదీప్ మజుందార్ తెలిపారు. న్యూఢిల్లీలో విలేకరుల సమావేశంలో ప్రసంగిస్తూ మజుందార్... ఆసియాన్-ఇండియా సదస్సుకు ప్రధానమంత్రి హాజరు కావడం ఇది పదోసారని చెప్పారు. లావోస్ ప్రధానమంత్రి - సోనెక్సే సిఫాండోన్ ఆహ్వానం మేరకు మోదీ - వియంటియాన్ కు వెళ్తున్నారని చెప్పారు. ప్రధానమంత్రి మోదీతో పాటు ఇతర ఆసియాన్ దేశాధి నేతలు - భారత్, ఆసియాన్ దేశాల మధ్య సంబంధాల పురోగతిని సమీక్షిస్తారు.

**HARYANA -BJP**

హర్యానాలో - భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంతో ఆ రాష్ట్రంలో మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు పార్టీ సమాయత్తం అవుతోంది. ఈ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ తరఫున ముఖ్యమంత్రి పదవిని చేపట్టేందుకు తాత్కాలిక ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైనీ సిద్ధంగా ఉన్నారు. ఎన్నికల ప్రచారంలో కూడా, భారతీయ జనతా పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తే, నయాబ్ సింగ్ సైనీ ముఖ్యమంత్రి అవుతారని హోంమంత్రి అమిత్ షా ప్రకటించారు. ఇదిలా ఉండగా, మెజారిటీ సాధించిన తరువాత, ఈరోజు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మోహన్ లాల్ బరోలీ, తాత్కాలిక ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ న్యూఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీని కలిశారు. ఈ సమావేశంలో హర్యానాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు, ప్రమాణ స్వీకారంపై చర్చించారు. హర్యానా ప్రజలు వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు ఒక పార్టీకి అవకాశం ఇవ్వడం ఇదే తొలిసారి. 90 స్థానాలకు గానూ బిజెపికి 48 సీట్లు వచ్చిన సంగతి తెలిసిందే.

## PREZ – VISIT

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వచ్చే ఆదివారం నుంచి ఏడు రోజుల పాటు అల్జీరియా, మౌరిటానియా, మలావిలలో పర్యటిస్తారు. కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి దమ్ము రవి రాష్ట్రపతి పర్యటన వివరాలను న్యూఢిల్లీలో విలేకరులకు వివరిస్తూ... ఆఫ్రికాతో భాగస్వామ్యాన్ని భారత్ మరింత బలోపేతం చేసుకునేందుకు ఈ పర్యటన దోహదపడుతుందన్నారు. గత ఏడాది జి-20 కి భారత్ అధ్యక్షత వహించిన సమయంలో - ఆఫ్రికన్ యూనియన్ ప్రముఖ సభ్యదేశంగా మారిన తరుణంలో ఈ పర్యటన ప్రాముఖ్యత సంతరించుకుందని అన్నారు. ఆఫ్రికా 54 దేశాలను కలిగి ఉంది. గ్లోబల్ సౌత్ ఎజెండాను నడపడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చాలా ఆసక్తి కనబరుస్తున్నారని దమ్ము రవి చెప్పారు. ఆఫ్రికాతో భాగస్వామ్యం మన దేశాభివృద్ధికి చాలా కీలకమైనదని అన్నారు. భారత్ - ఆఫ్రికా దేశాల మధ్య ఆర్థిక భాగస్వామ్యం పెరుగుతోందని, ద్వైపాక్షిక వాణిజ్యం ఏటా దాదాపు 100 బిలియన్ డాలర్లుగా ఉందని కేంద్ర ఆర్థిక కార్యదర్శి తెలియజేశారు.

## KARNATAKA - MALDIVES PRESIDENT

మాల్దీవుల అధ్యక్షుడు మహమ్మద్ ముయిజ్జూ, ఆయన సతీమణి సాజిదా మహమ్మద్ రెండు రోజుల పర్యటన నిమిత్తం ఈరోజు బెంగళూరు చేరుకున్నారు. వారికి కర్ణాటక ఉన్నత విద్యాశాఖ మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్ స్వాగతం పలికారు. ఈరోజు రాజ్‌భవన్‌లో ముయిజ్జూ దంపతులకు గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ విందు ఏర్పాటు చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ... ప్రథమ మహిళ సాజిదా మొహమ్మద్ బెంగళూరులో చదువుకున్నారని తెలిసి సంతోషం వ్యక్తం చేశారు. బెంగళూరులోని ప్రముఖ ఐటీ పరిశ్రమలతో భాగస్వామిగా ఉండటానికి మాల్దీవులు చూపుతున్న ఆసక్తిని కూడా ఆయన స్వాగతించారు. కర్ణాటక హస్తకళలు, చేనేత రంగాలను ప్రోత్సహించడానికి మాల్దీవులతో వాణిజ్య సంబంధాలను కూడా ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. అనంతరం ముయిజ్జూ పరిశ్రమ

ప్రముఖులతో సంభాషించారు. ముయిజ్జు దంపతులు రేపు మాల్దీవులకు తిరిగి వెళతారు.

## ఎస్సీ కులాల వర్గీకరణ

సుప్రీంకోర్టు తీర్పుకు అనుగుణంగా ఎస్సీ కులాల వర్గీకరణ అమలుకు ఏక సభ్య కమిషన్ నియామకం వెంటనే చేపట్టి 60 రోజుల్లోనే కమిషన్ నివేదిక సమర్పించేలా చూడాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించిన అనంతరం దానికి అనుగుణంగా రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీకి కొత్తగా నోటిఫికేషన్లు జారీ చేయనున్నట్లు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎస్సీ వర్గీకరణ అమలు, బీసీ సామాజిక, ఆర్థిక కుల సర్వేపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈరోజు సమీక్ష నిర్వహించారు.

## TABLE-TENNIS

ఏషియన్ టేబుల్ టెన్నిస్ ఛాంపియన్ షిప్ -2024 లో భారత మహిళల జట్టు కాంస్య పతకం సాధించింది. 1972 నుంచి జరుగుతున్న ఈ పోటీల్లో భారత జట్టుకి పతకం రావడం ఇదే తొలిసారి.